www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229




సంపుటి : 17 | సంచిక : 227 | మంగళవారం 20.10.2026 | ఎడిటర్ : కొమరరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



# ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్

- ఫ్యూచర్ సిటీకి కొత్త పోలీస్ కమిషనరేట్.. సీఎం ప్రారంభం
- ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం
- ఫ్యూచర్ సిటీ భద్రతకు ప్రత్యేక పోలీస్ కమిషనరేట్
- రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్త కమిషనరేట్ ప్రారంభోత్సవం
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్
- ఫ్యూచర్ సిటీలో శాంతిభద్రతలకు పటిష్ట చర్యలు
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించనున్న సీఎం
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులపై సీఎం సమీక్ష
- గ్లోబల్ ఇన్వెస్ట్ సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో సీఎం చర్చలు
- ఫ్యూచర్ సిటీకి భద్రతా బలోపేతం.. కొత్త కమిషనరేట్ అందుబాటులోకి
- ఫ్యూచర్ సిటీలో కీలక ముందడుగు.. పోలీస్ కమిషనరేట్ ప్రారంభం
- పారిశ్రామిక, నివాస ప్రాంతాల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు

02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఫ్యూచర్ సిటీ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో DGP సీవీ ఆనంద్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషితో పాటు పలువురు ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఫ్యూచర్ సిటీ భవిష్యత్ అవసరాలు, పారిశ్రామిక, నివాస ప్రాంతాల...

# ఎల్‌నినో ఎఫెక్ట్..

## కరువు పరిస్థితులపై సర్కారు ఫోకస్

**ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ఖర్చు వేగవంతం చేయాలి**

**నిధుల వినియోగంలో జాప్యం వద్దు: డిప్యూటీ సీఎం భట్టి**

- ఎల్‌నినోపై అధ్యయనానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- కరువు నివారణకు భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రత్యేక కమిటీ
- ఎల్‌నినో ఎఫెక్ట్.. కరువు పరిస్థితులపై సర్కారు ఫోకస్
- తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలకు ప్రభుత్వం సిద్ధం

03



# రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు..

భూవివాదాలకు చెక్.. రైతులకు భూహక్కుల భరోసా



గడిచిన 34 నెలల్లో 12.40 లక్షల పాస్‌బుక్ లు జారీ

రీ-సర్వేతో వేలాది మంది రైతులకు భూహక్కుల కల్పన

**రైతుల భూహక్కులే లక్ష్యం.. అధికారులకు మంత్రి ఆదేశాలు**

- భూవివాదాలకు చెక్.. రైతులకు భూహక్కుల భరోసా
- రైతులకు శుభవార్త.. భూహక్కుల కల్పనకు సర్కారు చర్యలు
- భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఏళ్ల తరబడి భూసమస్యలకు రీ-సర్వేతో పరిష్కారం
- భూముల రీ-సర్వేతో రైతులకు చట్టబద్ధమైన హక్కులు
- భూహక్కుల కల్పనే లక్ష్యం.. రెవెన్యూ వ్యవస్థలో మార్పులు

02

# 50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

- దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటుకు సీఎం ఆదేశాలు
- ఎల్‌నినో ఎఫెక్ట్.. తక్కువ నీటితో పండే పంటలే సాగు చేయాలి
- గోదావరి జలాల నిల్వపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నీటి కొరతపై అప్రమత్తం.. గోదావరి ఆనకట్టను పరిశీలించిన తుమ్మల

02



# రాహుల్ గాంధే అసలైన చోర్

- ఓటు చోరీ ఆరోపణలపై రాహుల్‌కు బీజేపీ కౌంటర్
- రాహుల్ ఆరోపణలు నిరాధారం: రామచందర్ రావు
- ఓటు చోరీకి ఆధారాలేవీ? బీజేపీ నేత ప్రశ్న
- రాహుల్ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ ఎదురుదాడి

02






# రైతులకు నష్టం చేయవద్దు

రూ.25 కోట్లతో కాఫర్ డ్యాం.. కరువుకు పరిష్కారం

## కాఫర్ డ్యాం నిర్మిస్తే నెలన్నరలో నీటి సమస్యకు పరిష్కారం

- ప్రాణహిత నీటిని ఒడిసిపట్టండి.. ప్రభుత్వానికి కవిత సూచన
- 21 వేల చెరువులు ఎండిపోయాయి.. కవిత ఆందోళన
- ప్రాణహిత జలాలతో రిజర్వాయర్ల నింపొచ్చు: కల్వకుంట్ల కవిత
- నీళ్లున్నా రైతులకు కష్టాలే.. ప్రభుత్వంపై కవిత విమర్శలు

03

తెలంగాణలో కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రాణహిత నదీ జలాలను వృథా చేయకుండా వినియోగించుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని కోరారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద రూ.25 కోట్లతో కాఫర్ డ్యాం నిర్మిస్తే నెలన్నర రోజుల్లో నీటిని రిజర్వాయర్లకు ఎత్తిపోయవచ్చని సూచించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సాగునీరు, విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో తీవ్ర నీటి కష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# రూ.16 కోట్ల చిట్టీల మోసం..

## చిట్‌ఫండ్ కేసులో ప్రధాన నిందితురాలు అరెస్ట్



హెచ్‌ఎంటీ హిల్స్‌లో చిట్‌ఫండ్ మోసం.. మహిళ అరెస్ట్

- కూకట్‌పల్లిలో రూ.16 కోట్ల చిట్‌ఫండ్ మోసం
- అధిక లాభాల ఆశతో రూ.16 కోట్లు టోకరా
- కష్టార్జితం కొల్లగొట్టిన చిట్‌ఫండ్ ముఠా.. పోలీసుల దర్యాప్తు
- కూకట్‌పల్లిలో భారీ చిట్‌ఫండ్ కుంభకోణం వెలుగులోకి

02




# ట్రాఫిక్ పోలీసుల కొరడా !

## హైదరాబాద్‌లో నకిలీ నంబర్ ప్లేట్లతో 100 వాహనాలు సీజ్

- నంబర్ ప్లేట్లు మార్చితే జైలుకే.. ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక
- ఎనిమిది నెలల్లో 100 కేసులు.. 100 వాహనాలు స్వాధీనం
- నకిలీ నంబర్ ప్లేట్లకు చెక్.. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్
- వాహనాల గుర్తింపు దాచితే కఠిన చర్యలు తప్పవు
- నంబర్ ప్లేట్లలో అక్రమ మార్పులు చేస్తే కేసులు నమోదు
- నకిలీ నంబర్ ప్లేట్లపై నిరంతర తనిఖీలు.. పోలీసుల స్పష్టీకరణ

02

# పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలి

- పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలి: హరీశ్ రావు
- కార్మికుల జీతాల పెంపుపై ప్రభుత్వానికి హరీశ్ రావు డిమాండ్
- పారిశుధ్య కార్మికులకు పండగ కానుక అందించిన హరీశ్ రావు
- కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో పోరాడతా: హరీశ్ రావు
- మూడేళ్లయినా జీతాలు పెంచలేదు.. కాంగ్రెస్‌పై హరీశ్ రావు విమర్శలు

03



# ఓటు ఒక ఆయుధం..

- సూపర్ సిక్స్ హామీల అమలుకు రూ.36 వేల కోట్లు
- 2024 ఎన్నికలు చరిత్రలో నిలిచి పోతాయి
- ప్రజల అభిప్రాయాలే ప్రామాణికం.. పాలనపై నిరంతర సమీక్ష
- సంక్షేమ పథకాల కోసం ఇప్పటి వరకు రూ.1.50 లక్షల కోట్లు

02



# మీరు రెండు పెన్‌లతో ఫిర్యాదు రాశారు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** యాక్సిడెంట్, దొంగతనాలు, సీనియర్ సిటిజన్‌లకు సంబంధించిన సంఘటనల్లో స్పాట్‌లోనే ఫిర్యాదును తీసుకుని గంట నుంచి 24 గంటలలోపు ఎఫ్ఐఆర్ కాపీని మీ ఫోన్‌కు పంపిస్తాం.. మీరు ఎఫ్ఐఆర్ కోసం పోలీసు స్టేషన్ చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన అవసరం లేదని పోలీసులు ఉన్నాతాధికారులు చెబుతున్నా.. సిబ్బంది మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నారు. సిబ్బంది ప్రవర్తనతో భయాందోళనలో ఉన్న బాధితులను మరింత కలవరానికి గురి చేస్తున్నారు.

**మీరు ఫిర్యాదును తీసుకోం..**

అక్టోబరు 18 ఆదివారం మధ్యాహ్నం 2.15 నిమిషాలకు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ జీనోమ్ వ్యాలీ పోలీసు స్టేషన్ పరిధిలో మజీద్ పూర్ చౌరస్తాలో రోడ్డు ప్రమాదం జరిగింది. మేడ్చల్ నుంచి మజీద్ పురా చౌరస్తా మీదుగా షామీర్ పేట్ వైపు మళ్ళుతున్న కారును షామీర్ పేట్ నుంచి సిద్ధిపేట్ వైపు వెళ్తున్న సిమెంట్ రెడిమిక్స్ లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు తీవ్రంగా ధ్వంసమైంది. బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ఉన్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటనతో భయాందోళనలో ఉన్న బాధితులు ముందుగా 112కు ఫిర్యాదు చేశారు. 15 నిమిషాల తర్వాత వచ్చిన జినోమ్ వ్యాలీ పోలీసులు సంఘటనను పరిశీలించారు. బాధితులు ఫిర్యాదును రాసి అక్కడికి వచ్చిన పోలీసులకు ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే మీరు ఫిర్యాదును రెండు పెన్‌ల(బ్లూ, బ్లాక్ రంగులు)తో రాశారు. ఈ ఫిర్యాదును తీసుకోవడం కుదరదు అని మొండికేశారు. మీరు స్టేషన్‌కు వచ్చి ఇవ్వాలని చెప్పారని బాధితులు వాపోయారు. ప్రజాధనంతో కొనుగోలు చేసిన పెట్రోలింగ్ వాహనాల్లో బాధితులను స్టేసన్‌కు తీసుకువెళ్ళే ప్రయత్నం కూడా పోలీసులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు బాధితులు నిలదీయడంతో ఫిర్యాదు తీసుకున్నారు.. కానీ ఇంత వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలుస్తోంది. కారును ఢీకొట్టిన లారీని కూడా ఇంతవరకు గుర్తించలేదని సమాచారం. ఈ విధంగా సైబరాబాద్ పోలీసులు వారి విచిత్ర ప్రవర్తనతో భయంలో ఉన్న బాధితులను మరింత కలవరానికి గురి చేస్తున్నారు.



# 50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గోదావరి నీళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు. భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను ఇవాళ మంత్రి తుమ్మల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటాయని, తక్కువ నీటి వినియోగం ఉండే పంటలు సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. విద్యుత్ ఉత్పత్తి తగ్గడం నీటి కొరత వల్ల రైతులు వరి సాగు చేయొద్దన్నారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో 50 డిగ్రీలు ఎండలు దాటే అవకాశం ఉందని, తాగునీటి కష్టాలు లేకుండా గోదావరి నీళ్లను నిల్వ చేయాలని సీఎంకు వివరించానన్నారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు పనులు చేయాలని సీఎం ఆదేశించారని అన్నారు.

# రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు కల్పించడం, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో గత ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం, స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, సలహాల మేరకు రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. భూభారతి చట్టం అమలు, రైతులకు పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూముల రీ-సర్వే, భూ సమస్యల పరిష్కారం, ఇటీవల తీసుకున్న కీలక నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థంగా పనిచేయాలని ఆదేశించారు.

**34 నెలల్లో 12.40 లక్షల పాస్‌బుక్కుల పంపిణీ**

రాష్ట్రంలో భూవివాదాలు లేని పరిస్థితిని తీసుకురావాలనే సంకల్పంతో చారిత్రాత్మక భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఈ చట్టం 2025 ఏప్రిల్ 14న అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 5,68,858 పట్టాదారు పాస్‌బుక్కులు జారీ చేసినట్లు వెల్లడించారు. అంతకుముందు 6,71,508 పాస్‌బుక్కులు జారీ చేయగా, మొత్తం 12,40,366 పాస్‌బుక్కులను రైతులకు అందించినట్లు వివరించారు.

**రీ-సర్వేతో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం**

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను భూభారతి చట్టం ప్రకారం రీ-సర్వే ద్వారా పరిష్కరిస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా భూములను సాగు చేస్తున్నప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో హక్కులు నమోదు కాక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్న రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ సాగుదారులను గుర్తించి, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీ-సర్వే నిర్వహించి గిరిజనులు, గిరిజనేతరుల భూ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో రీ-సర్వే నిర్వహించి 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించినట్లు వెల్లడించారు. పట్టాదారు పాస్‌బుక్కులు పొందిన రైతులు బ్యాంకు రుణాలు, రైతు భరోసా సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ములుగు జిల్లాలోని ముల్కాపల్లి మండలంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలాల్లో రీ-సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.

**న్యాయం జరిగేలా పకడ్బందీ చర్యలు:**

ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలను పరిష్కరించి, త్వరలోనే అర్హులైన హక్కుదారులకు పాస్‌బుక్కులు అందిస్తామని చెప్పారు. ఇదే విధానాన్ని ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. భూమిపై హక్కుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజలకు న్యాయం జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, జారీ చేస్తున్న ఉత్తర్వులు క్షేత్రసాయిలో పకడ్బందీగా అమలైనప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని పొంగులేటి పేర్కొన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు పనిచేయాలని సూచించారు. జనగామ జిల్లాలో ఫుడ్ పార్క్ ఏర్పాటు అంశంపై ఆ జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# ఓటు ఒక ఆయుధం..

**ఆంధ్రప్రదేశ్ :** స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కీలక వ్యాఖ్యలు చేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అన్ని ఎన్నికలకూ ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్న ఆయన.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అంతర్భాగమని, ఎలాంటి వ్యక్తులను ప్రజాప్రతినిధులుగా ఎంపిక చేసుకోవాలనే అవకాశం ప్రజలకు ఎన్నికల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ఓటు ఒక ఆయుధమని, ఓటు హక్కు వినియోగంలో ధనిక, పేద అనే తేడా ఉండదని స్పష్టం చేశారు. 2024 ఎన్నికలు చరిత్రలో నిలిచిపోయాయని చంద్రబాబు అన్నారు. ఆ ఎన్నికల్లో కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్ వచ్చిందని, ఇలాంటి ఫలితం గతంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసం, అరాచకం, అవినీతి కారణంగా ప్రజాజీవనం స్తంభించిపోయిందని, ప్రజల్లో సంతోషం లేని పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఇప్పుడు ఆ దిశగా ప్రభుత్వం పనిచేస్తున్న తీరు ప్రజలకు కనిపిస్తోందని చంద్రబాబు తెలిపారు. తన అరెస్టు సమయంలో 53 రోజుల పాటు ప్రజలు నిరసనలు తెలిపారని, కూటమికి ప్రజలు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు.. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు ప్రధాన లక్ష్యాలతో రాష్ట్రాన్ని ఒక్కో మెట్టు పైకి తీసుకెళ్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1.50 లక్షల కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ భద్రత కల్పించడంతో పాటు, వృద్ధులకు పెన్షన్లు అందించి వారు ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఏడాది కాలంలో ఈ హామీల కోసం రూ.36 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, దీపం పథకాలతో పాటు మత్స్యకారులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, నాయీ బ్రాహ్మణులు, ఇమాములు, పూజారులు తదితర వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయనే అంశంపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. నెలలో రెండు శనివారాలు పార్టీ డేటాను పరిశీలిస్తున్నానని చెప్పారు. ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు సహా మొత్తం 55 రకాల సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా నివేదికలు తెప్పిస్తున్నామని వివరించారు. ప్రజల అభిప్రాయాల ఆధారంగా ప్రభుత్వ పనితీరును మెరుగుపరుచుకుంటున్నామని పేర్కొన్నారు. ఇక, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చంద్రబాబు తెలిపారు. సాంకేతికతను వినియోగించుకుంటూ ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, సంక్షేమాన్ని కొనసాగించడం, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

# ట్రాఫిక్ పోలీసుల కొరడా !

**చంపాపేట్,ఫ్లాష్ ఇండియా :** వాహనాల అసలు గుర్తింపును దాచిపెట్టి, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నకిలీ, మార్పులు చేసిన, అనధికారిక రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ల వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో గత ఎనిమిది నెలల్లో 100 క్రిమినల్ కేసులు నమోదు చేసి, 100 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 88 ద్విచక్ర వాహనాలు, 12 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నట్లు ట్రాఫిక్ పోలీసు విభాగం వెల్లడించింది. వాహనాల గుర్తింపును దాచిపెట్టడం, ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినప్పుడు పోలీసుల నిఘా నుంచి తప్పించుకోవడం, చట్టపరమైన చర్యలను అధిగమించడం వంటి ఉద్దేశాలతో కొందరు నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలాంటి చర్యలు ట్రాఫిక్ నియంత్రణకు ఆటంకం కలిగించడమే కాకుండా, నేరాల దర్యాప్తులోనూ తీవ్ర సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలు తప్పనిసరి..**

మోటారు వాహనాల చట్టం-1988, కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు-1989 ప్రకారం ప్రతి వాహనంపై నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ల (హెచ్ఎస్ఆర్‌పీ) వినియోగాన్ని కూడా పాటించాలని సూచించారు. నంబర్ ప్లేట్ల పై అంకెలను మార్చడం, అనధికారిక అక్షరాల శైలులను ఉపయోగించడం, స్టిక్కర్లు లేదా ఇతర అలంకరణలతో అసలు నంబర్ కనిపించకుండా చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ప్రతి వాహన యజమాని తన వాహనంపై అసలైన, స్పష్టంగా కనిపించే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగింపు..**

నకిలీ, తారుమారు చేసిన నంబర్ ప్లేట్లతో తిరిగే వాహనాలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించి, సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**అక్రమాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి..**

వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, నంబర్ ప్లేట్ల విషయంలో ఎలాంటి అక్రమ మార్పులకు పాల్పడవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లతో అనుమానాస్పదంగా తిరిగే వాహనాలు కనిపిస్తే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. నకిలీ నంబర్ ప్లేట్ల వినియోగాన్ని ఏమాత్రం సహించబోమని, వాహనాల గుర్తింపు, రహదారి భద్రత, చట్ట అమలును మరింత పటిష్ఠం చేసేందుకు తనిఖీలు కొనసాగిస్తామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం స్పష్టం చేసింది.



# సింగరేణి అధికారులకు దసరా కానుక..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దసరా పండుగ వేళ సింగరేణి సంస్థ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. బొగ్గు గనుల్లో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి అధికారుల దీర్ఘకాలిక విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని కోల్ ఇండియా తరహాలోనే వేతనాల పెంపు వర్తింపజేస్తూ సింగరేణి యాజమాన్యం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం ద్వారా ఎగ్జిక్యూటివ్ క్యాడర్ 1 నుంచి 7 వరకు ఉన్న సుమారు 1,800 మంది అధికారులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. సెప్టెంబర్ 25 నుంచే ఈ ఆర్థిక ప్రయోజనాలు వర్తించేలా సంస్థ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవ:**

సింగరేణి అధికారుల సంఘాలు, ప్రతినిధులు ఎదురుచూస్తున్న ఈ వేతన సవరణ సమస్య పరిష్కారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవ తీసుకున్నారు. అధికారుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఆయన, వేతన పెంపు ప్రక్రియను పూర్తి చేయించి పండుగ పూట అధికారుల ఇళ్లలో వెలుగులు నింపారు. అటు ఇప్పటికే కార్మికులకు దసరా బోనస్‌ను ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు అధికారులకు కూడా వేతన సవరణ అమలు చేయడంతో సింగరేణి ఉద్యోగులు, అధికారుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# రూ.16 కోట్ల చిట్టీల మోసం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ (KPHB) ప్రాంతంలో భారీ చిట్ ఫండ్ మోసం వెలుగులోకి వచ్చింది. అమాయక ప్రజల కష్టార్జితాన్ని ఆశ చూపించి టోకరా వేసిన ఘరానా మోసం తాజాగా పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. ఈ చిట్ ఫండ్ కుంభకోణం సుమారు రూ. 16 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కేవలం తక్కువ కాలంలోనే ఎక్కువ లాభాలు వస్తాయన్న నమ్మకంతో సుమారు 45 మంది పెట్టుబడిదారులు ఈ ముఠా చేతిలో మోసపోయినట్లు సమాచారం.

**నివాస ప్రాంతంలోనే దందాలు.. ప్రధాన నిందితురాలు అరెస్ట్**

ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న సీత (కొన్ని నివేదికలలో సీతమ్మగా గుర్తింపు)ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులు (రామనా రెడ్డి తదితరులు) కలిసి ఈ చిట్ ఫండ్ వ్యాపారాన్ని గుట్టుగా నిర్వహించినట్లు విచారణలో తేలింది. నిందితులు KPHB పరిధిలోని HMT హిల్స్ ప్రాంతంలో నివాసం ఉంటూ స్థానికంగా చాలా కాలంగా చిట్ ఫండ్ స్కీమ్‌లను నడుపుతున్నారు. నమ్మకం కలిగించేలా ప్రవర్తిస్తూ పెద్ద మొత్తంలో డిపాజిట్లు, పెట్టుబడులు సేకరించిన ఈ ముఠా.. ఆ తర్వాత చేతులు ఎత్తేసింది. బాధితులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినప్పటికీ నిందితులు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

**కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు**

బాధితుల ఫిర్యాదు మేరకు అప్రమత్తమైన స్థానిక పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి ఆర్థిక లావాదేవీలపై లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ చిట్ ఫండ్ దందాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో ఆరా తీస్తున్నారు. నగరంలో పెరుగుతున్న ఇలాంటి అనధికారిక చిట్ ఫండ్ల మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధిక వడ్డీలు లేదా లాభాల ఆశ చూపే అసాధారణ పథకాలను నమ్మి మోసపోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఫ్యూచర్ సిటీ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో DGP సీవీ ఆనంద్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషితో పాటు పలువురు ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఫ్యూచర్ సిటీ భవిష్యత్ అవసరాలు, పారిశ్రామిక, నివాస ప్రాంతాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త కమిషనరేట్‌ను తీర్చిదిద్దినట్లు అధికారులు వెల్లడించారు.

**'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' సందర్శన:**

కమిషనరేట్ ప్రారంభోత్సవం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి యాచారం మండలం మంగలితండా వద్ద నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని సందర్శిస్తారు. ఆ ప్రాంగణంలోనే నిర్వహించబోయే ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి చేరుకుని పనులపై సమీక్షించనున్నట్లు తెలుస్తోంది.

# పాలకవర్గం తీరుపై గ్రామస్తుల ఆగ్రహం!

**శంకరపట్నం,ఫ్లాష్ ఇండియా :** తొమ్మిది రోజులు తీరొక్క పూలతో గౌరమ్మ తల్లిని పూజించిన ప్రజల మనోభావాలను ఆ గ్రామ పాలకవర్గం గాలికి వదిలేసింది. వివరాల్లోకి వెళితే.... శంకరపట్నం మండలంలోని మెట్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర్ల పల్లె లో సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్న పల్లె వాసులకు చెరువుల్లో, కుంటల్లో నీళ్లు లేకపోయేసరికి రోడ్డు పక్కన బతుకమ్మలను వదిలివేసి వెళ్లారు. పాలకవర్గం పట్టించుకోని ఏ గుట్ట కో ఏ చెరువులోనూ నిమజ్జనం చేయాల్సిన వారు పట్టించుకోకపోవడంతో రోడ్డు పక్కన ప్రయాణిస్తున్న పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. బతుకమ్మ తల్లికి అపచారం జరిగిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పంచాయతీ పాలకవర్గం బతుకమ్మలను నిమజ్జన ప్రదేశానికి తరలించాలని గ్రామస్తులు కోరారు.




ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# అఫిడవిట్లపై ప్రైవేట్ ఫిర్యాదు చేయొచ్చు

**ఢిల్లీ :** ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తప్పుడు అఫిడవిట్లపై పై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. అభ్యర్థులు తమ నామినేషన్ అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇచ్చినా, కీలక వివరాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినా.. వారిపై సామాన్య ఓటర్లు, ప్రైవేట్ వ్యక్తులు నేరుగా క్రిమినల్ ఫిర్యాదు దాఖలు చేయవచ్చని సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951 (RP Act)లోని సెక్షన్ 125A కింద ప్రైవేట్ ఫిర్యాదులను న్యాయస్థానాలు స్వీకరించవచ్చని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ శీల్ నాగులతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఇలాంటి కేసుల్లో కేవలం ఎన్నికల సంఘం లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి మాత్రమే ఫిర్యాదు చేయాలన్న సీఆర్‌పీసీ సెక్షన్ 195(1) నిబంధన వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తప్పుడు అఫిడవిట్లు సమర్పించే అభ్యర్థులపై కేవలం ప్రభుత్వ అధికారులే ఫిర్యాదు చేయాలన్నది చట్టసభల ఉద్దేశమైతే, ఆ మేరకు చట్టంలో సవరణ ఉండేదని, అలాంటి పరిమితి ఏదీ చట్టంలో లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కర్ణాటకలోని బీదర్ శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ శైలేంద్ర బెల్దాలే తన అఫిడవిట్‌లో నివాస చిరునామాకు సంబంధించి తప్పుడు వివరాలు సమర్పించారంటూ ఓ ఓటరు దాఖలు చేసిన పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఈ అప్పీల్ దాఖలైంది. ప్రైవేట్ వ్యక్తుల ఫిర్యాదు చెల్లదని హైకోర్టు పేర్కొన్న చట్టపరమైన కారణాలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అయితే, ప్రస్తుత కేసులో ఎమ్మెల్యే చిరునామాపై ఆరోపణలను సమర్థించేలా ఆధారాలు లేవని, విచారణ కొనసాగించడం న్యాయ సమయాన్ని వృథా చేయడమేనని పేర్కొంటూ ఆ కేసును కొట్టివేసిన హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. కానీ నిబంధనల పరంగా ఎన్నికల్లో పారదర్శకత కోసం అభ్యర్థుల తప్పుడు అఫిడవిట్లపై క్రిమినల్ చర్యలు కోరే సంపూర్ణ హక్కు ఓటర్లకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రాహుల్ గాంధే అసలైన చోర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఓటు చోరీ అంటూ రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు విమర్శించారు. ఓటు చోరీ జరిగిందనే ఆరోపణలకు ఆయన ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారని మండిపడ్డారు. నిజానికి రాహుల్ గాంధీనే అసలైన దొంగ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గాంధీ ఇంటిపేరును ఆయన దొంగిలించారని దానిని అక్రమంగా ఉపయోగించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం ఓ న్యూస్ ఏజెన్సీతో మాట్లాడిన రామచందర్ రావు.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు అనేక సార్లు స్పష్టత ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో బలవంతపు ఓట్ల తొలగింపులు జరగలేదని, ఓటు చోరీ కూడా లేదని స్పష్టం చేశాయని తెలిపారు.

**ప్రజలను తప్పుదోవ పట్టించడమే:**

రాహుల్ గాంధీ ప్రజల ముందు, రాష్ట్రపతి, సుప్రీంకోర్టులోనూ తన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు సమర్పించలేకపోయారని రామచందర్ రావు అన్నారు. ఆధారాలు లేకుండా పదేపదే ఓటు చోరీ జరిగిందని ఆరోపించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. ఎన్నికల సంఘం చేపట్టిన SIR ప్రక్రియకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు, ఇండియా కూటమి, పలు సామాజిక కార్యకర్తలు నిరసనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో బీజేపీ చేస్తున్న ఈ కౌంటర్ ఎటాక్ ఆసక్తిగా మారింది. మరోవైపు, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్ కూడా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలపై విమర్శలు గుప్పించారు. యువతను ఉపయోగించుకుని అశాంతిని రెచ్చగొట్టేందుకు, బంగ్లాదేశ్ తరహాలో ప్రభుత్వ మార్పునకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ ఎంపీ రేఖా శర్మ కూడా దేశంలో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయాలని చూస్తున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఐరోపాలో జరుగుతున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. అక్కడ ప్రజా ఆస్తులు ధ్వంసం అవుతున్నాయని, దుకాణాలు దోపిడీకి గురవుతున్నాయని, దశాబ్దాల అభివృద్ధి దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ వంటి సంస్థలు కూడా భారత్‌లో ఇలాంటి విధ్వంసాన్ని కోరుకుంటున్నాయని ఆరోపించారు. ఒకవైపు దేశ నిర్మాణానికి కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ఉంటే, మరోవైపు రాహుల్ గాంధీ నాయకత్వంలోని విధ్వంసక శక్తులు ఉన్నాయని విమర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు



**పెద్దపల్లి జిల్లా, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వాటిని పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఏవో బండి ప్రకాష్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చూపాలని కోరారు.

**వృద్ధాప్యంలో బాగోగులు చూడడం లేదని ఫిర్యాదు**

ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్ బీ తన వృద్ధాప్యంలో కుమారులు, కుమార్తె తన బాగోగులు చూసుకోవడం లేదని ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. దీనిపై స్పందించిన ఏవో, సంబంధిత సంక్షేమ శాఖ అధికారి (ఎఫ్ఆర్ఓ)కు దరఖాస్తును పంపిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఖాళీ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు**

రామగుండం మండలం గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన కొమ్ము చందు యాదవ్, కోర్టు కేసులో ఉన్న ఇంటి నంబర్ 7-1-166/1 పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని జంగిలి రాజిరెడ్డి అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని రామగుండం తహసీల్దార్‌కు దరఖాస్తును పంపించారు.

**పత్తి పంట నష్టంపై పరిహారం కోరిన రైతు**

జూలపల్లి మండలం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన కుంటూరి రాజయ్య తనకు చెందిన రెండెకరాల 20 గుంటల పత్తి పంటకు ఎస్‌కే రెడ్డి కంపెనీకి చెందిన బయో పెస్టిసైడ్ పిచికారీ చేసిన అనంతరం పంట దెబ్బతిన్నదని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, జరిగిన పంట నష్టానికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ ఫిర్యాదును జిల్లా వ్యవసాయ అధికారికి పంపించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏవో సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ పవన్ కుమార్, ఈ సెక్షన్ పర్యవేక్షకులు విజయ్, సీ సెక్షన్ పర్యవేక్షకులు కోటేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఎల్‌నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీకి చైర్మన్‌గా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు వాకిటి శ్రీహరి సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలపై ఈ కమిటీ సమీక్షించనుంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనుంది. నీటి లభ్యత, తాగు నీటి సరఫరాపై నిరంతర సమీక్షలు నిర్వహించనుంది. ఇక జల సంరక్షణకు ప్రాధాన్యం.. ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించనుంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టనుంది. వేసవికి ముందే గ్రామీణ నీటి సమస్యల గుర్తింపు, పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయనుంది. అలాగే ఎల్‌నినో ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్షించి.. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది.

**నిధుల ఖర్చులో జాప్యం ఉండొద్దు: డిప్యూటీ సీఎం భట్టి**

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగాన్ని వేగవంతం చేయాలని అధికారులను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. నిధుల ఖర్చులో జాప్యం ఉండొద్దని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రుణాల పునర్ వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల వ్యయంపై నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు.



# పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలి

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల వేతనాలను తక్షణమే పెంచాలని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే హరీష్ రావు పండగ కానుక అందజేసి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి సమస్య ల పరిష్కారానికి పోరాడతానని హామీనిచ్చారు. కార్మికుల శ్రమ ఫలితమే సిద్దిపేటకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు, జాతీయ స్థాయి అవార్డులు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మలన్నసాగర్ నుంచి సిద్దిపేట పట్టణానికి తాగు నీరు అందిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు, కార్మికులకు శ్రమ తప్పింది అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్మికుల జీతాలను రూ.16 వేలకు పెంచినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా కార్మికులకు ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదన్నారు. కాంగ్రెస్ వాళ్లు అధికారంలోకి వస్తే తులం బంగారం, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాల పీఎఫ్, ఈఎస్ఐ లేదా అకౌంట్ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అని చెప్పి పురుషులకు టికెట్ ఛార్జీలను రెట్టింపు చేసిందని అన్నారు.

# రైతులకు నష్టం చేయవద్దు

**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** ఇవాళ రాష్ట్రమంతా కరువు పరిస్థితులు ఉన్నాయని, కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రాణహిత నది నీళ్లు రోజుకు రెండు టీఎంసీల చొప్పున ప్రవహిస్తున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కొన్ని బ్యారేజీలు రిపేర్లలో ఉన్నాయన్న కారణం చూపి మూడేళ్లుగా వేల టీఎంసీల నీటిని వృథా చేశారని అన్నారు. పార్టీ నాయకులతో కలిసి కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద సోమవారం ప్రాణహిత ప్రవాహాన్ని ఆమె పరిశీలించారు. ఇన్నాళ్లు మంచి వానలు పడటంతో గత బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ సమస్య నుంచి తప్పించుకున్నాయన్నారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో 21 వేల చెరువులు ఎండిపోయాయని తెలిపారు. రాష్ట్రంలో చెరువులపై ఆధారపడి వ్యవసాయం చేసుకునే రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇక్కడ ఒక కాఫర్ డ్యాం నిర్మిస్తే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. నెలన్నర రోజుల్లో రూ.25 కోట్లతో ఈ పనిని పూర్తి చేసి నీటిని ఎత్తిపోసుకోవచ్చన్నారు. మేడిగడ్డను బై-పాస్ చేస్తూ నీటిని రిజర్వాయర్లకు ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందన్నారు. అన్ని పార్టీలు వచ్చి ఈ అంశంపై పోరాటం చేస్తాయని, కానీ టీఆర్ఎస్ మాత్రం పోరాటం చేస్తూనే పరిష్కారాన్ని కూడా చూపిస్తోందన్నారు. రాష్ట్రంలోని ఎంతోమంది నిపుణులతో మాట్లాడిన తర్వాతే ఈ పరిష్కారాన్ని సూచిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఈ అంశానికి సంబంధించి ముఖ్యమంత్రికి లేఖ కూడా రాస్తామన్నారు.

**రూ.81.50 లక్షలు వసూలు చేశారంటూ ఆరోపణలు!**

ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్న చిత్తశుద్ధితో తాము ఇక్కడి వరకు వచ్చామన్నారు. ఏదో రాజకీయాలు చేస్తూ టీవీల్లో కనిపించాలనే ఉద్దేశం తమ పార్టీకి లేదన్నారు. తాము చేసిన సూచనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని రైతులకు మేలు చేయాలన్నారు. ఉత్తర తెలంగాణలో ఎస్సారెస్పీ, కడెం, అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులకు నీళ్లు ఇస్తూ 37 లక్షల ఎకరాలను స్థిరీకరించే ప్రయత్నం చేశారన్నారు. మొత్తంగా రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసి స్థిరీకరణ మాత్రమే చేశారని, కాళేశ్వరం ద్వారా కొత్తగా లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారన్నారు. ఈ విషయం చెబితే బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తమపై దాడి చేస్తుందని అన్నారు. కానీ నిజాలు మారవని, వాస్తవాలు కచ్చితంగా కఠినంగానే ఉంటాయని వ్యాఖ్యానించారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మరింత ఘోరంగా తయారైందన్నారు. రూ.26 వేల కోట్లు ఖర్చు చేసి కొత్తగా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. అడిగితే బకాయిలు చెల్లించామని చెబుతున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, దళిత బంధు లాంటి బకాయిలు చెల్లించకుండా వీటినే ఎందుకు చెల్లించినట్లు చెబుతున్నారని ప్రశ్నించారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా ఇక్కడి నుంచి అన్నారం, సుందిళ్లకు నీటిని ఎత్తిపోయవచ్చన్నారు. ఈ నీటితో ప్రతి ప్రాజెక్టును రీచార్జ్ చేసుకోవచ్చని తెలిపారు. రూ.25 కోట్లు ఖర్చు చేస్తే నెలన్నర రోజుల్లో ఈ పనులు పూర్తి చేయవచ్చన్నారు. ఎల్ నినో పరిస్థితుల కారణంగా వచ్చే ఏడాది కూడా వానలు పడతాయో లేదోనని చెబుతున్నారన్నారు. ఒకవేళ ఈ ప్రభుత్వం తమ సూచనలను పట్టించుకోకపోతే వారికి ఎలా చెప్పాలో కూడా తమకు తెలుసన్నారు. తెలంగాణలో కోటి 36 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే ఈసారి కోటి 10 లక్షల ఎకరాల్లో సాగు జరిగిందన్నారు. ప్రస్తుతం పంట చివరి దశలో ఉందని, రైతులకు నీళ్లు, కరెంట్ అవసరమని తెలిపారు. దీనికి సంబంధించిన సాంకేతిక వివరాలను కూడా ప్రభుత్వానికి అందిస్తామన్నారు. మేడిగడ్డను రిపేర్ చేసేందుకు కూడా ఇదే సరైన సమయమని, ఆ పనులను సైతం ప్రారంభించాలన్నారు. ఈ విషయాన్ని ప్రతి రైతుకు తెలిసేలా పార్టీ నాయకులు వివరించాలని సూచించారు. కరెంట్, నీళ్లు ఇవ్వగలిగే పరిస్థితి ఉండి కూడా ఇవ్వకపోతే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తాము ఇచ్చిన సూచనల్లో ఏవైనా మార్పులు ఉంటే ఇంజినీర్లు వాటిని సరిచేయాలని సూచిస్తే అందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పని చేస్తే సరేనని, లేదంటే తమ ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా ఈ ప్రతిపాదనలను అమలు చేస్తామన్నారు. ఎక్కడ పొలాలను చూసినా రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. అందుకే ప్రభుత్వానికి నీళ్లు ఎలా ఇవ్వవచ్చో మార్గనిర్దేశం చేసేందుకు తాము ఇక్కడి వరకు వచ్చామన్నారు. ఈ ముఖ్యమంత్రి రైతులకు సంబంధించిన సంఘాల్లో కూడా రాజకీయాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రైతు సమస్యలకు సంబంధించిన సంఘాల్లో రాజకీయాలు వద్దని సూచించారు. కాళేశ్వరం కోసం దాదాపు రూ.93 వేల కోట్లు ఖర్చు పెట్టి కొత్తగా లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారన్నారు. కాళేశ్వరం నీటిని అందించేందుకు కాలువలు తవ్వకపోవడంతో కొత్తగా 19 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడం సాధ్యం కావడం లేదన్నారు. ఆ కాలువలను పూర్తి చేయాలంటే మరో రూ.50 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రభుత్వం ప్రస్తుతం అంత ఖర్చు చేసే పరిస్థితిలో లేదన్నారు. ఇప్పటికే ఎల్లంపల్లి సహా అన్ని రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటాయని, ఎల్లంపల్లిలో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ చేశారని తెలిపారు. రానున్న పది నెలల్లో భయంకరమైన పరిస్థితులను చూడాల్సి ఉంటుందని కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు.

# దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు



**నల్లగొండ జిల్లా / చింతపల్లి, దేవరకొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆశలు, ఆనందాలు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**ధర్మానికి, సత్యానికి విజయదశమి ప్రతీక**

చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

**యువత బాధ్యతగా వ్యవహరించాలి**

దసరా వేడుకలను యువత ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, అదే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పండుగ సంబరాలు కుటుంబాల్లో విషాదాన్ని నింపకూడదని, చిన్నపాటి నిర్లక్ష్యం విలువైన ప్రాణాలను బలిగొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం సేవించిన వారు స్వయంగా వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను వినియోగించుకోవాలని తెలిపారు. "మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తుంటుంది. సురక్షితంగా ఇంటికి చేరడం కంటే గొప్ప పండుగ మరొకటి లేదు" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

**అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం**

దేవరకొండ నియోజకవర్గంలోని రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు, పేదలు, బడుగు బలహీన వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, యువతకు మెరుగైన అవకాశాలు, మహిళల సాధికారతకు ప్రాధాన్యతనిస్తానని పేర్కొన్నారు.

**ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు**

ఈ విజయదశమి రైతులకు మంచి పంటలు అందించాలని, యువతకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సురక్షితంగా పండుగను జరుపుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుతూ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లకు నూతన వస్త్రాల పంపిణీ



**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళేశ్వరంలోని శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి దేవాలయ బాలాలయం వద్ద మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. మహేష్, కాళేశ్వరం గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు గందేసిరి సత్యనారాయణ, సుంకరి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసర పండుగ శుభాకాంక్షలు..



**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జగిత్యాల ప్రాంత ప్రజలతోపాటు, యావత్ తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలందరికి మాజీ మంత్రివర్యులు, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ ప్రజల జీవన విధానంలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రకృతిని ప్రేమిస్తూ, పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ సొంతం. బతుకమ్మ పండుగ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక.. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండగ. పూలను దైవ స్వరూపంగా భావించి, గౌరమ్మను కొలిచే విశిష్టమైన సంప్రదాయం తెలంగాణ ఆడవిడ్డలది..

**జమ్మి చెట్టు విజయానికి చిహ్నం..**

అందరి జీవితాల్లో సుఖ సంతోషలూ వెల్లి విరియాలనీ మనస్పూర్తిగా కోరుకుంటూ జగిత్యాల ప్రాంతమంతోపాటు, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు..

# పాలమూరు వీరుడు పండగ సాయన్న పోరాట స్ఫూర్తికి నాటక రూపం!

## 22న రవీంద్ర భారతిలో 'పండగ సాయన్న' నాటక ప్రదర్శన





**మహబూబ్‌నగర్ ,ఫ్లాష్ ఇండియా జిల్లా ప్రతినిధి :** అణగారిన ప్రజల హక్కుల కోసం పోరాడిన తెలంగాణ ప్రజానాయకుడు పండగ సాయన్న ధైర్యసాహసాలు, పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని ఆయన సమాధి వద్ద 'పండగ సాయన్న' నాటక పోస్టర్‌ను నాటక బృందం, ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు.ఈ నెల 22న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పండగ సాయన్న జయంతి వేడుకల్లో భాగంగా ఈ నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించనున్నారు. ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి నేపథ్య వ్యాఖ్యానం అందించనుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.కార్యక్రమంలో పండగ సాయన్న పాత్రధారి ధ్రువ బాద్మి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ది విజయకుమార్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ కేఎస్ రవికుమార్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. నాటకం ద్వారా సాయన్న ఆశయాలు, పోరాట చరిత్రను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమానికి బ్రేక్ లేదు..

**కూసుమంచి,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు అందించే సంక్షేమ పథకాల అమలును ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సోమవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన గత ప్రభుత్వాలకు భిన్నంగా, అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, తండాల్లోనూ విడతలవారీగా ఇళ్లు అందిస్తున్నామని చెపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 2.30 లక్షల నుంచి 2.40 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అవసరమైతే మరింత వ్యయం చేసి మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు నిర్మించి అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.నిరుద్యోగ యువతకు ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు కల్పించామని, మరో 14 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని ఉద్యోగాల భర్తీ చేపడతామని వెల్లడించారు. మహిళా సంఘాలకు గత 33 నెలల్లో రూ.73 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. పేదల ముఖాల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని చెబుతూ రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, కూసుమంచి ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహసీల్దార్ సైదులు, హౌసింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



# అన్నారంలో వెన్నెపురెడ్డి లచ్చిరెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్

**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మహాదేవపూర్ మండలంలోని అన్నారం గ్రామంలో వెన్నెపురెడ్డి లచ్చిరెడ్డి జ్ఞాపకార్థం సోమవారం స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువతను క్రీడల వైపు ప్రోత్సహించే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు.ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.10,000, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5,000 నగదు బహుమతిని అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఉత్సాహభరితంగా కొనసాగుతున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగియనుందని వారు పేర్కొన్నారు.



# రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలురు

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి పండుగ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు , ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు.ఈ విజయదశమి సందర్భంగా సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యత,సోదరభావం,పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.సమానత్వం, సామాజిక న్యాయం వెల్లివిరిసి, బీసీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో వారి జనాభా దామాషా ప్రకారం వారి వాటా వారికి కల్పించాలన్నారు.



# మోస్ట్ ప్రామిసింగ్ రీసెర్చర్ అవార్డుకు డాక్టర్ సుతారి సతీష్ ఎంపిక

**ములుగు,ఫ్లాష్ ఇండియా :** కేన్ మాన్ ఆఫ్ తెలంగాణ, వృక్షశాస్త్ర నిపుణులు, ములుగు వాస్తవ్యులు డాక్టర్ సుతారి సతీష్ ప్రతిష్ఠాత్మకమైన మోస్ట్ ప్రామిసింగ్ రీసెర్చర్ అవార్డుకు ఎంపికయ్యారు. సైంటిఫిక్ లారెల్స్ సంస్థ ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేశారు. పరిశోధన రంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు ప్రకటించగా ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో 55 పరిశోధనా పత్రాలు ప్రచురించి, 18 పుస్తకాలు రాయడంలో భాగస్వామి అయి తెలంగాణ-ఆంధ్ర రాష్ట్రాలనుండి 15 జాతుల కొత్త మొక్కలను పరిశోధనా రంగానికి పరిచయం చేశారు. పర్యావరణ పరిరక్షణకు, పాలంపేట కేన్ మొక్కల సంరక్షణకు 18 సంవత్సరాలు పాటు కృషి చేసిన ఆయన ప్రస్తుతం హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ & పీజీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడంతో పలువురు అభినందనలు తెలిపారు.






# బాధితులకు అండగా పోలీస్ శాఖ.. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు



**పెద్దపల్లి జిల్లా, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** బాధితులకు న్యాయం అందించడం, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకొని, చట్టపరిధిలో పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ఆయా ఫిర్యాదుల వివరాలను పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సీపీ భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, ఎలాంటి జాప్యం లేకుండా విచారణ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**మహిళలు, వృద్ధులు, చిన్నారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి**

మహిళలు, వృద్ధులు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో అధికారులు అత్యంత సున్నితంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. బాధితులకు తగిన భరోసా కల్పిస్తూ, వారి సమస్యలను చట్టప్రకారం పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, బాధితులకు సత్వర న్యాయం కల్పించే దిశగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సాగు నీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో సాగునీరు అందక ఎండిపోయిన పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటలు ఎండిపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రైతులను వ్యవసాయం చేయొద్దని చెబుతున్న ముఖ్యమంత్రి రాజకీయాలు బంద్ పెడతారా? అని కవిత ప్రశ్నించారు. పంటలు వేయవద్దని రైతులకు చెప్పేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుండాలని వ్యాఖ్యానించారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతులను పంటలు వేయవద్దని చెప్పలేదని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు.

**ప్రాణహిత జలాలను వినియోగించుకోవాలి**

ప్రాణహిత నుంచి నీటిని ఎత్తిపోస్తే తెలంగాణలోని కీలక ప్రాజెక్టులను నింపి రైతుల పంటలను కాపాడవచ్చని కవిత అన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి ఈ దిశగా చొరవ చూపడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని, ప్రాణహిత జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు విజయవంతమైందా లేదా అన్నది పక్కనపెడితే రైతులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. ప్రాణహిత వద్ద చిన్న కాఫర్ డ్యామ్ నిర్మిస్తే 35 నుంచి 40 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత బేషజాలకు పోకుండా వెంటనే అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు.

**పంట నష్టంపై నివేదిక ఏదీ?**

కరీంనగర్‌కు సమీపంలోని గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించకపోవడం ఆశ్చర్యంగా ఉందని కవిత అన్నారు. కేంద్రాన్ని సాయం అడుగుతామని చెబుతున్న ముఖ్యమంత్రి, పంట నష్టం ఎంత జరిగిందో లెక్కలు సేకరించారా? అని ప్రశ్నించారు. పంట నష్టంపై ప్రభుత్వం వద్ద స్పష్టమైన అధికారిక నివేదిక లేదని విమర్శించారు.

**రైతుకు రూ.50 వేల నష్టం.. ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

అధికారంలోకి వస్తే 24 గంటల విద్యుత్ అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఐదు గంటల కరెంటు కూడా ఇవ్వలేకపోతోందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాజకీయాలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఒక్కో రైతుకు సుమారు రూ.50 వేల వరకు నష్టం జరుగుతోందని, ఈ నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.





# 47 ఏళ్ల వయసులోనూ తగ్గేదేలే..

వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్, యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ మరోసారి తనదైన శైలిలో అభిమానులను అలరించాడు. 47 ఏళ్ల వయసులోనూ తగ్గేదేలే అంటూ.. మైదానంలో అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2026 ఫైనల్‌లో భాగంగా ఇంగ్లాండ్ ఛాంపియన్స్ బ్యాటర్ జో డెన్లీ ఇచ్చిన క్యాచ్‌ను గాల్లోకి ఎగిరిపట్టుకున్నాడు. దాంతో డెన్లీ గోల్డెన్ డక్‌గా పెవిలియన్‌కు చేరాడు. గేల్ పట్టిన క్యాచ్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఇంగ్లాండ్ ఛాంపియన్స్ ఇన్నింగ్స్‌లో ఎనిమిదో ఓవర్ ఐదో బంతికి క్రిస్ గేల్ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. వెస్టిండీస్ బౌలర్ డ్వేన్ బ్రావో యార్కర్ లెంగ్త్‌లో వేసిన బంతిని జో డెన్లీ ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే బంతి బ్యాట్‌కు తగిలి కవర్స్ వైపు వెళ్లింది. అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న గేల్ క్షణాల్లో స్పందించి కుడివైపునకు డైవ్ చేస్తూ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. దీంతో డెన్లీ ఒక్క పరుగు కూడా చేయకుండానే వెనుదిరిగాడు. క్యాచ్ అందుకున్న వెంటనే గేల్ సంబరాలు చేసుకున్నాడు. బౌలర్ బ్రావో వచ్చి అతడిని అభినందిస్తూ హత్తుకున్నాడు. ఈ వయసులోనూ గేల్ చూపించిన చురుకుదనం, అద్భుతమైన ఫీల్డింగ్ నైపుణ్యంపై సోషల్ మీడియాలో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఫైనల్‌లో క్రిస్ గేల్ రెచ్చిపోయాడు. 14 బంతుల్లో ఓ ఫోర్, 2 సిక్సర్లతో 21 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. మరోవైయిపు డ్వేన్ బ్రావో బంతితో సత్తా చాటాడు. తన నాలుగు ఓవర్లలో 21 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ రవి బొపారాను 16 పరుగుల వద్ద, జో డెన్లీని డకౌట్‌గా, సమిత్ పటేల్‌ను మూడు పరుగుల వద్ద పెవిలియన్‌కు పంపాడు. మిగతా వెస్టిండీస్ బౌలర్లు కూడా తలో వికెట్ తీసి ఇంగ్లాండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. టాస్ గెలిచిన వెస్టిండీస్ ఛాంపియన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఇంగ్లాండ్ ఓపెనర్లు జేసన్ రాయ్ (7), డేవిడ్ మలన్ (2) త్వరగానే ఔటయ్యారు. అనంతరం మొయిన్ అలీ 39 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 60 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. ఒవైస్ షా 28 బంతుల్లో అజేయంగా 38 పరుగులు చేయడంతో ఇంగ్లాండ్ ఛాంపియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ ఛాంపియన్స్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. క్రిస్ గేల్ 14 బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో 21 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత లెండిల్ సిమన్స్, చంద్విక్ వాల్టన్ కలిసి ఇంగ్లాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. రెండో వికెట్‌కు కేవలం 70 బంతుల్లోనే 123 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సిమన్స్ 53 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, మూడు సిక్సర్లతో అజేయంగా 77 పరుగులు చేయగా.. వాల్టన్ 35 బంతుల్లో మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో నాటౌట్‌గా 58 పరుగులు సాధించాడు. దీంతో వెస్టిండీస్ ఛాంపియన్స్ 17 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి 165 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచి డబ్ల్యూసీఎల్ 2026 టైటిల్‌ను కైవసం చేసుకుంది.

# టీమిండియా నుంచి డ్రాప్..



భారత టీ20 జట్టు నుంచి డ్రాప్ అయిన తర్వాత స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న లోకల్ టోర్నమెంట్‌లో ఆడుతున్నారు. ముంబై క్రికెట్ అసోసియేషన్ రంజీ ట్రోఫీ జట్టులో చోటు దక్కకపోవడంతో, ఆయన తన ఫామ్‌ను నిరూపించుకునేందుకు ఎంసీఏ ప్రెసిడెంట్ కప్ 'ఎ' అండ్ 'బి' డివిజన్ మ్యాచ్‌లను ఆశ్రయించారు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో తక్కువ స్కోరుకే పరిమితమైనప్పటికీ, రెండో మ్యాచ్‌లో మాత్రం తనదైన శైలిలో విరుచుకుపడి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. దాదర్ యూనియన్ క్లబ్‌తో జరిగిన మ్యాచ్‌లో నంబర్ 3 స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సూర్యకుమార్ యాదవ్.. ఎంఐజీ క్రికెట్ క్లబ్ తరఫున కేవలం 15 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 అద్భుతమైన సిక్సర్లతో 38 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అంతకుముందు ముస్లిం యునైటెడ్ స్పోర్ట్స్ క్లబ్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లో 10 బంతుల్లో 3 ఫోర్లతో 17 పరుగులు మాత్రమే చేయగలిగారు. టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్‌లో భారత్‌ను ఛాంపియన్‌గా నిలిపినప్పటికీ, ఆ టోర్నీలో స్వయంగా ఆయన బ్యాటింగ్‌లో పెద్దగా రాణించలేకపోయారు. 2025 ఏడాది అంతటా కూడా ఆయన ప్రదర్శన నిలకడలేకుండా సాగింది. దీంతో సెలెక్టర్లు ఆయనను టీ20 జట్టు నుంచి తప్పించడమే కాకుండా, కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా తొలగించారు. ప్రస్తుతం టీమిండియా టీ20 పగ్గాలను శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించారు. ఇప్పటికే టెస్టు, వన్డే జట్లకు దూరంగా ఉన్న సూర్య, కేవలం పొట్టి ఫార్మాట్‌లోనే కొనసాగుతూ వచ్చారు. అయితే ఇప్పుడు ఆ ఫార్మాట్ నుంచి కూడా ఉద్వాసనకు గురికావడంతో, మళ్లీ జాతీయ జట్టులోకి పునరాగమనం చేయడానికి ఈ లోకల్ టోర్నీల ద్వారా తీవ్రంగా శ్రమిస్తున్నారు.

# పారా ఆసియా క్రీడల్లో భారత్ బోణీ..





జపాన్ వేదికగా జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్స్ బోణీ కొట్టారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 విభాగంలో మోనా అగర్వాల్ స్వరణ పతకం సాధించగా, అవని లేఖరా రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. సోమవారం జరిగిన ఫైనల్‌లో మోనా 250.0 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా అవని 249.6 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. ఇక పురుషుల విభాగంలో స్వరూప్ ఉన్హాల్కర్, ఎన్.రాకేశ్ రౌండ్లలో ప్రతిభ చాటినప్పటికీ, స్వరూప్ కొద్దిపాటి తేడాతో నాలుగో స్థానంలో నిలిచి పతకాన్ని చేజార్చుకున్నాడు.

**వరల్డ్ రికార్డు సమం చేసిన శీతల్ దేవి:**

పారా ఆర్చరీ విభాగంలో భారత సంచలనం శీతల్ దేవి సరికొత్త అధ్యాయం లిఖించింది. మహిళల కాంపౌండ్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో శీతల్ దేవి 720 పాయింట్లకు గాను ఏకంగా 704 పాయింట్లు సాధించింది. ఈ ప్రదర్శనతో ప్రపంచ రికార్డును సమం చేయడమే కాకుండా, పాత ఆసియా రికార్డును 6 పాయింట్ల తేడాతో అధిగమించి కొత్త ఆసియా రికార్డును నెలకొల్పింది.

**జూడోలో పతకం ఖాయం:**

మరోవైపు పారా జూడో మహిళల -52 కేజీల విభాగంలో భారత రేసర్ కోకిల అద్భుత ప్రదర్శనతో ఫైనల్లోకి దూసుకెళ్లింది. దీంతో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. పారా అథ్లెటిక్స్, పారా స్విమ్మింగ్, పారా పవర్ లిఫ్టింగ్ విభాగాల్లోనూ భారత పతకాల వేట కొనసాగుతోంది. ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో పారాలింపిక్ పతక విజేతలు నిషాద్ కుమార్, అజీత్ సింగ్ యాదవ్, ప్రపంచ ఛాంపియన్ రింకూ హుడాలు ముందుండి భారత బృందాన్ని నడిపిస్తున్నారు. ఆర్చరీ విభాగంలో హర్విందర్ సింగ్, పాయల్ నాగ్ కూడా శీతల్ దేవితో కలిసి పతకాల వేటలో నిలిచారు.

**భారత్ నుంచి 168 మంది అథ్లెట్స్:**

పారా ఆసియా క్రీడలు-2026 ల్లో భారత నుంచి 168 మంది క్రీడాకారులు బరిలో ఉన్నారు. ఆసియా ఖండంలో 45 దేశాల నుంచి 3 వేల మంది పారా అథ్లెట్స్ పోటీ పడనున్నారు. ఈ క్రీడలు అక్టోబర్ 24న ముగియనున్నాయి. కాగా గత పారా ఆసియా క్రీడల్లో భారత్ నుంచి దాదాపు 300 మంది అథ్లెట్స్ పోటీ పడి 29 స్వర్ణాలు సహా 111 పతకాలు సాధించారు.

# టీమిండియాలోకి రీఎంట్రీ..





భారత జాతీయ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌పై మాజీ క్రికెటర్ మోహద్ కైఫ్ ప్రశంసల వర్షం కురిపించారు. భువనేశ్వర్ కుమార్ ఏమాత్రం తక్కువ కాదని, అగ్రశ్రేణి పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో సమానంగా రాణించగలడని ఆయన అభిప్రాయపడ్డారు. టీ20 అంతర్జాతీయ క్రికెట్ గణాంకాలను పరిశీలిస్తే బుమ్రాకు, భువికి మధ్య పెద్దగా తేడా ఉండదని కైఫ్ పేర్కొన్నారు. బుమ్రా టీ20 ఇంటర్నేషనల్స్ లో 6.52 ఎకానమీ రేట్ కలిగి ఉండగా, భువనేశ్వర్ కుమార్ ఎకానమీ రేట్ 6.96గా ఉందని, ఈ రికార్డులే వారిద్దరి సత్తాను తెలియజేస్తాయని తెలిపారు. సెలెక్షన్ గురించి ఎక్కువగా ఆలోచించకుండా కేవలం తన ఆటపైనే దృష్టి పెట్టడం వల్లే భువి మళ్లీ జట్టులోకి పునరాగమనం చేయగలిగాడని కైఫ్ అన్నారు. సెలెక్షన్ కోసం మీడియాను ఆశ్రయించడం, ఇతరులతో సిఫార్సులు చేయించడం వంటి పనులకు భువి దూరంగా ఉంటాడని చెప్పారు. నిరంతరం ట్రైనర్లు, ఫిజియోలతో కలిసి శ్రమిస్తూ, తన బౌలింగ్ నైపుణ్యాలైన యార్కర్లు, ఇన్-స్వింగ్, అవుట్-స్వింగ్, స్లోయర్ బంతులను మెరుగుపరుచుకోవడంలో ఎప్పుడూ నిమగ్నమై ఉంటాడని తెలిపారు. గతంలో టీమిండియా ఓడిపోయిన కొన్ని మ్యాచ్‌లలో భువనేశ్వర్‌పై అనవసరంగా విమర్శలు వచ్చాయని కైఫ్ గుర్తుచేశారు. బోర్డుపై తగినన్ని పరుగులు లేనప్పటికీ, ఆ వైఫల్యాల భారాన్ని మొత్తం బౌలర్లపైనే మోపడం సరికాదన్నారు. భువి రికార్డులు ఎప్పుడూ అద్భుతంగానే ఉన్నాయని, ఏకాగ్రతతో చేసే కఠిన సాధనే ఆయనను మళ్లీ ఉన్నత స్థాయికి చేర్చిందని కైఫ్ అభిప్రాయపడ్డారు.

# బిజినెస్



## కొత్తవారం పెరిగిన గోల్డ్ రేట్లు..

దసరా షాపింగ్ దేశవ్యాప్తంగా జోరందుకున్న వేళ బులియన్ మార్కెట్లు మళ్లీ తిరిగి పుంజుకుంటున్నాయి. ప్రధానంగా వెండి రేట్లు కొంత స్థిరత్వాన్ని కొనసాగిస్తున్నప్పటికీ.. గోల్డ్ రేట్లు మాత్రం వారం రోజుల తగ్గుదల తర్వాత మళ్లీ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో రిటైల్ ఆభరణాల షాపింగ్ చేస్తున్న రిటైల్ కొనుగోలుదారులు ముందుగా తమ సమీపంలోని నగరాల్లో అమ్మకపు రిటైల్ ధరలను పరిశీలించటం బెటర్. అక్టోబర్ 19న బంగారం రేట్లు మళ్లీ పెరిగాయి. దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.38 పెరిగింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.14వేల 804గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 570గా కొనసాగుతోంది. సోమవారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. అక్టోబర్ 19, 2026న దేశవ్యాప్తంగా స్థిరంగా కొనసాగుతున్నాయి. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కూడా స్వచ్ఛమైన వెండి కేజీ రూ.2లక్షల 40వేలుగా కొనసాగుతోంది. అంటే గ్రాము దాదాపు రూ.240 దగ్గర ఉంది.

## పవర్ గ్రిడ్‌కు డేటా సెంటర్ల ముప్పు



దేశంలో వేగంగా విస్తరిస్తున్న డేటా సెంటర్లు జాతీయ విద్యుత్ గ్రిడ్‌కు కొత్త చిక్కులను తెచ్చిపెడుతున్నాయని జాతీయ గ్రిడ్ ఆపరేటర్ గ్రిడ్-ఇండియా హెచ్చరించింది. విద్యుత్ లైన్లలో సాంకేతిక లోపాలు లేదా వోల్టేజ్ తగ్గినప్పుడు, డేటా సెంటర్లు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా గ్రిడ్ నుండి డిస్‌కనెక్ట్ అయి, వెంటనే తమ సొంత బ్యాటరీలు లేదా జనరేటర్లకు మళ్లుతాయి. గ్రిడ్ భాషలో 'సైలెంట్ ఎగ్జిట్'గా పిలిచే ఈ ప్రక్రియ వల్ల, ఏకంగా 1 నుండి 3 గిగావాట్ల వరకు భారీ విద్యుత్ డిమాండ్ క్షణాల వ్యవధిలో గ్రిడ్ నుంచి మాయమవుతుంది. ఇది ఒక చిన్న రాష్ట్రం మొత్తానికి అవసరమైన విద్యుత్‌తో సమానమైన సరఫరా-డిమాండ్ వ్యత్యాసాన్ని సృష్టించి గ్రిడ్ వ్యవస్థ అస్థిరపడే ప్రమాదముంది. ప్రస్తుతం 2 గిగావాట్ల కంటే తక్కువగా ఉన్న భారత డేటా సెంటర్ల సామర్థ్యం 2030 నాటికి 24-26 గిగావాట్లకు చేరుకుంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనా వేస్తున్న నేపథ్యంలో.. అమెరికాలోని వర్జీనియాలో 3.8 గిగావాట్ల లోడ్ కోత వల్ల ఏర్పడిన గ్రిడ్ సంక్షోభం భారత్‌లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రిడ్-ఇండియా సీఎండీ సమీర్ చంద్ర సక్సేనా సూచించారు. దీన్ని నివారించేందుకు సౌర, పవన విద్యుత్ ఎక్కువగా లభించే గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో వీటిని ఏర్పాటు చేయడం, విద్యుత్‌ను ఆదా చేసే ఆధునిక కూలింగ్ పద్ధతులను పాటించడం ఎంతో అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన ఆదేశాలు





దేశంలో పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు (ఎఫ్‌బీఓ) కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఖోయా, పనీర్, మాంసం, చేపలు వంటి త్వరగా పాడైపోయే ఆహార పదార్థాలను సేకరణ దశ నుండి తుది వినియోగదారునికి చేరే వరకు పరిశుభ్రమైన వాతావరణంలో, సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం, ప్యాక్ చేయడం, రవాణా చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ ఉత్పత్తులను రవాణా చేసేటప్పుడు గోనె సంచులు లేదా ఫుడ్-గ్రేడ్ కాని ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, కేవలం శుభ్రమైన మూత ఉన్న వాహనాలు, నాణ్యమైన ప్యాకేజింగ్ మెటీరియల్ మాత్రమే ఉపయోగించాలని ఆదేశించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006 నిబంధనల ప్రకారం.. రవాణా, నిల్వ సమయంలో ఉష్ణోగ్రతల నిర్లక్ష్యానికి పాల్పడినా, సరుకు రవాణా పత్రాలను సమర్పించకపోయినా లేదా పరిశుభ్రతా ప్రమాణాలను ఉల్లంఘించినా సదరు ఆహార ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేయడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా వ్యాపారాల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్లు, రైల్వే అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రాంతీయ డైరెక్టర్లను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ శర్మ ఆదేశించారు.

## పెట్రోల్-డీజిల్-సీఎన్జీ ధరలు..

ఈ నెల పెట్రోల్, డీజిల్ ధరల్లో ప్రాంతాన్ని బట్టి స్వల్ప మార్పులు జరుగుతుంటాయి. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వాణిజ్య, పారిశ్రామిక ఉత్పత్తిపై గతంలో విధించిన ఇంధన విక్రయాల ఆంక్షలను మాత్రం కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. పెట్రోల్ బంకుల్లో ఒకే వాహనానికి రోజుకు 200 లీటర్ల డీజిల్ మాత్రమే విక్రయించాలనే పరిమితిని కేంద్రం జులై 1 నుంచి రద్దు చేసింది. 1 వ తారీకు వస్తే ధరలు తగ్గుతాయనే ఎదురుచూసిన ప్రజల ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి. ఇక సీఎన్‌జీ ధరల్లో కూడా ఎలాంటి మార్పులు లేదు. చివరిసారిగా మే చివరి వారంలో పెరిగిన ధరలే ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మరీ తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్,సీఎన్జీ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**హైదరాబాదు**

లీటర్ పెట్రోల్ ధర: రూ. 116.15
లీటర్ డీజిల్ ధర రూ. 104.23



సీఎన్జీ కిలో ధర రూ. 112.00

**వరంగల్**

లీటర్ పెట్రోల్ ధర: రూ.115.62
లీటర్ డీజిల్ ధర రూ.103.74
సీఎన్జీ కిలో ధర రూ:112.00

**విశాఖపట్నం..**

లీటర్ పెట్రోల్ ధర: రూ.116.39
లీటర్ డీజిల్ ధర రూ. 104.11
సీఎన్జీ ధరలు రూ.99.80

**విజయవాడ:**

లీటర్ పెట్రోల్ ధర: రూ.117.25
లీటర్ డీజిల్ ధర రూ. 104.96
సీఎన్జీ ధరలు రూ.103.00



## అక్టోబర్-19 గ్యాస్ సిలిండర్ ధరలు

గత కొన్ని నెలల కిందటే గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగి వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. మళ్లీ రీసెంట్ గా అక్టోబర్ 1 వ తారీకున వాణిజ్య ఎల్పీసీ సిలిండర్ వినియోగదారులకు గట్టి షాక్ తగిలింది. 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో రెస్టారెంట్లు, హోటళ్లకు మరింత భారం పడనుంది. అలాగే 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 62. 50 రూపాయలు పెంచి జనాలను మరింత నిరాశకు గురయ్యేలా చేసింది. కానీ గృహ వినియోగదాలకు ఎలాంటి నష్టం లేదు. 14. 2 కేజీల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం రూ. 994 గా నడుస్తుంది. మరీ పెంచిన ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

హైదరాబాద్: రూ. 3,065
విజయవాడ: రూ. 2, 932. 50
విశాఖపట్నం: రూ. 2, 827.50
ముంబై: రూ. 2, 764
చైన్నై : రూ. 2, 983
ఢిల్లీ : రూ. 2, 837
పట్నా : రూ. 3, 100



# క్లారిటీ ఇచ్చిన అనుపమ

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్, విలక్షణ నటుడు నరేష్, దర్శకుడు తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 16న థియేటర్లలో విడుదల వర్కింగ్ రన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే, ఈ మూవీ ప్రమోషన్స్ సమయంలో నరేష్ పెళ్లి, పిల్లల గురించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వివాదంపై ఓ ప్రెస్‌మీట్‌లో భాగంగా నరేష్ వ్యాఖ్యలపై అనుపమ ఓపీనియన్ అడగ్గా.. దానికి ఆమె ఆమె పెళ్లి వద్దని, కేవలం పిల్లలను మాత్రమే కనాలని చెప్పినట్లుగా ఒక చిన్న వీడియో క్లిప్ నెట్టింట విపరీతంగా వైరల్ అయింది. దీనిపై నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడంతో తాజాగా, 'క్రేజీ కల్యాణం' సక్సెస్ మీట్‌లో పాల్గొన్న అనుపమ దీనిపై స్పందిస్తూ అసలు నిజాలను వెల్లడించారు. తన వ్యాఖ్యలను సగం మాత్రమే కట్ చేసి తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.తానెప్పుడూ పెళ్లి చేసుకోవద్దని చెప్పలేదని అనుపమ స్పష్టం చేశారు. పెళ్లి చేసుకోకపోయినా పిల్లలు కావాలనుకుంటే ప్లాన్ చేసుకోవచ్చని, కానీ కేవలం పిల్లల కోసమే పెళ్లి చేసుకుని ఆ తర్వాత విడాకులు తీసుకోవడం సరైన పద్ధతి కాదని మాత్రమే చెప్పానని వివరించారు. పిల్లల్ని కనేటప్పుడు వారికి సంతోషకరమైన జీవితాన్ని అందించడం ముఖ్యమని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక పక్కనే ఉన్న నరేష్ కూడా ఈ విషయంలో క్లారిటీ ఇచ్చారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే క్షమించాలని కోరారు. ప్రపంచంలో జనాభా తగ్గిపోతోందని, పెళ్లిళ్లకు భయపడి లివిన్ రిలేషన్‌షిప్‌ల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. పెళ్లి చేసుకున్నా లేదా రిలేషన్‌షిప్‌లో ఉన్నా పిల్లలను కనాలని, లేకపోతే సృష్టి ఆగిపోతుందనే ఉద్దేశంతోనే మాట్లాడానని తెలిపారు. దీంతో ఈ వివాదానికి చెక్ పడినట్లు అయింది.




## ఆదర్శ కుటుంబం నుంచి మరో అప్డేట్..

విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'ఆదర్శకుటుంబం'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 30న రిలీజ్‌కు రాబోతుండగా.. వరుస అప్డేట్స్‌తో సందడి చేస్తున్నారు చిత్ర బృందం. ఇందులో నుంచి ఇప్పటికే వచ్చిన మొదటి సాంగ్ చాట్ బస్టర్ హిట్ కాగా.. తాజాగా రెండొవ సాంగ్ అప్డేట్ ఇచ్చారు. 'ఆదర్శకుటుంబం నుండి రాబోయే మరో సంగీత విందు కోసం సిద్ధంగా ఉండండి! రెండొవ సింగిల్ 'మాలా' అక్టోబర్ 19న విడుదలవుతోంది' అంటూ వెంకీ మామా పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇక విడుదల చేసిన పోస్టర్‌లో దసరా బుల్లోడు స్టైల్‌లో వెంకీ మామా దర్శనమివ్వగా.. ఈ పోస్టర్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ప్రైవల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.




## టబు పోస్టర్ రిలీజ్

అక్కినేని నాగార్జున మైల్‌స్టోన్ 100వ చిత్రం 'King 100'. తమిళ దర్శకుడు రా.కార్తీక్ ఈ మూవీతో తెలుగులోకి దర్శకుడిగా ఎంట్రీ ఇస్తుండటం విశేషం. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. టబు, ఐశ్వర్య రాజేష్, సుస్మితా భట్, అశోక్ సెల్వన్, రవీంద్ర విజయ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమా నుంచి టబు క్యారెక్టర్‌కు సంబంధించిన సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు 'ఆమె ఉదయిస్తుంది.. అతని ప్రపంచం కుప్పకూలుతుంది. 20.10.26 తేదీని గుర్తుంచుకోండి.. ఈ దసరా సందర్భంగా, King100 ప్రపంచం నుండి అత్యంత హుందాతనం కలిగిన టబుని పరిచయం చేస్తున్నాం' అంటూ ఓ షాడో పోస్టర్‌ను రివీల్ చేసి టబు పాత్రపై క్యూరియాసిటీని పెంచేశారు మేకర్స్. కాగా.. అన్నపూర్ణ స్టూడియోస్, మనం ఎంటర్‌ప్రైజెస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మూవీ 2026 క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# బ్లడ్ బాత్‌కు సిద్ధంగా ఉండండి..




మెగామేనల్లుడు సాయి ధరమ్ తేజ్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ షూటింగ్ కంప్లీట్ చేసుకున్న తాజాగా అఫీషియల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'మెగా సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న సంబరాల ఏటిగట్టు సినిమా షూటింగ్ అధికారికంగా పూర్తయింది. వాడని వెపన్ లేదు, రక్తం వాడని రోజు లేదు.. ఈసంక్రాంతికి ఫ్యామిలీ సినిమాలతో పాటు బ్లడ్ బాత్‌కు సిద్ధంగా ఉండండి.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఫుల్ స్వింగ్‌లో జరుగుతున్నాయి' అంటూ ఓ స్పెషల్ వీడియో పంచుకున్నారు. 160 రోజులకు పైగా, 10కి పైగా భారీ షెడ్యూళ్లలో ఎంతో శ్రమించి సాగిన షూటింగ్‌కు ఎట్టకేలకు ముగింపు పలకడంతో.. ఈ వీడియో చివరిలో సాయి ధరమ్ తేజ్ మూవీ టీమ్ అందరిపై రక్తం పోసి రివేంజ్ తీర్చుకున్నాడు. ప్రజెంట్ ఈ స్పెషల్ వీడియో వైరల్ అవుతుంది. కాగా.. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా సాయి ధరమ్ తేజ్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో.. అతడు 'బాలి' అనే పాత్రలో చేతిలో కత్తితో యుద్ధవీరుడిలా కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచేశారు.

## ఇట్స్ అఫీషియల్..



నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందిన మోస్ట్ అవైటెడ్ రా అండ్ రస్టిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ది ప్యారడైజ్'. ఒక జాతి మనుగడ కోసం సాగించే ఉత్కంఠభరిత పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నాని సరసన కాయదు లోహర్ హీరోయిన్‌గా నటించింది. అలాగే సంపూర్ణేష్ బాబు, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, మరియు బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో కనిపించారు. దసరా లాంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత వీరి కలయికలో వచ్చిన సినిమా కావడంతో, దీనిపై విడుదల ముందే భారీ అంచనాలు నెలకొన్నాయి. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం, ప్రేక్షకులను ఆశించినంత స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది.దీంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌ను దక్కించుకుంది. అయితే, థియేటర్లలో విడుదలైన సరిగ్గా నెలరోజులకే ఈ చిత్రాన్ని డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. తాజాగా, ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జడల్ జమానాకు స్వాగతం అనే క్యాప్షన్ జత చేసి.. అక్టోబర్ 22 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా 'ది ప్యారడైజ్' మూవీ స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలిపారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కూడా అందుబాటులోకి రాబోతున్నట్లు ప్రకటించారు. థియేటర్లలో మిస్ అయిన నాని అభిమానులు, ఈ అప్‌డేట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## సూర్య 'సీన్' నుంచి రెండో పాట అప్డేట్..

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'సీన్'. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వంలో రాబోతున్న హై వోల్టేజ్ యాక్షన్ మూవీ సూర్య కెరీర్‌లో 47వ సినిమాగా రాబోతుంది. 2D ఎంటర్‌టైన్‌మెంట్స్, జగరం స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ మలయాళ మ్యూజిక్ డైరెక్టర్ సుశిన్ శ్యామ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ రిలీజ్ కాగా.. ఇందులో సూర్య డీఎస్పీ ప్రేమ్ రాజ్‌గా కనిపించిన తీరు ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నెలకొల్పింది. అలాగే ఫస్ట్ సింగిల్‌కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'సీన్ నుండి రెండవ సింగిల్ 'Airplane' రేపు సాయంత్రం 6 గంటలకు విడుదలవుతోంది' అంటూ ఓ సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చెయ్యగా.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రలో పోషిస్తున్నాడు. సుశిన్ శ్యామ్ మ్యూజిక్ అందిస్తున్నాడు. దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో విడుదల కాబోతున్నది.




# నేహా శర్మ వార్నింగ్




ఇటీవలి కాలంలో సినీ నటీమణుల రూపాన్ని ఏఐ ద్వారా దుర్వినియోగం చేయడం తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై ఇప్పటికే చాలామంది రియాక్ట్ కాగా.. తాజాగా, తన ప్రతిష్టను కాపాడుకునేందుకు నేహా శర్మ రంగంలోకి దిగి లీగల్ వార్నింగ్ ఇవ్వడం నెట్టింట సంచలనం సృష్టిస్తోంది. కొందరు వ్యక్తులు తన ప్రమేయం లేకుండానే తన ముఖాన్ని, రూపాన్ని ఉపయోగిస్తూ ఏఐ ద్వారా నకిలీ వీడియోలు, చిత్రాలను సృష్టిస్తున్నారంటూ ట్విట్టర్ వేదికగా సంచలన పోస్ట్ పెట్టారు. సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ మార్ఫింగ్, ఫేక్ కంటెంట్‌పై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన అనుమతి లేకుండా తన ఫేస్ లేదా రూపాన్ని ఉపయోగించి ఏఐ ద్వారా కంటెంట్ క్రియేట్ చేస్తున్న వారు వెంటనే ఆ పనిని ఆపేయాలని హెచ్చరించారు.ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అటువంటి ఫేక్ వీడియోలు, చిత్రాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. తన గుర్తింపును ఇలా దుర్వినియోగం చేస్తూ తనను తప్పుగా చిత్రీకరించడం, ప్రతిష్టకు భంగం కలిగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. దీనిని ఒక అధికారిక హెచ్చరికగా పరిగణించాలని ఆమె తేల్చి చెప్పారు. అంతేకాకుండా, నకిలీ ఖాతాల వెనుక దాక్కున్నా లేదా ఏఐ టెక్నాలజీని ఉపయోగించినా బాధ్యులు శిక్ష నుంచి తప్పించుకోలేరని నేహా శర్మ హెచ్చరించారు. ఈ విధమైన కంటెంట్‌ను తయారు చేసినా, పోస్ట్ చేసినా లేదా సోషల్ మీడియాలో ప్రచారం చేసినా సరే ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బాధ్యులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది.

Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229